

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



లీజుకు ఆర్టీసీ స్థలాలు

ఆదాయం పెంచుకునే క్రమంలో ఆర్టీసీ ఖాళీగా ఉన్న స్థలాలను ఐదేళ్ల లీజుకు ఇచ్చేందుకు సిద్ధమైంది.

8లో




జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

మార్కెట్‌కు భారీగా టమాట

- కక్కలపల్లి మండీలో కిలో గరిష్ట ధర రూ.45



అనంతపురం అగ్రికల్చర్: టమాట అమ్మకాలు అమాంతం పెరిగాయి. మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరుకు వస్తోంది. రికార్డుస్థాయిలో పలికిన ధరలు ప్రస్తుతం గణనీయంగా తగ్గాయి. నెల కిందట 100 నుంచి 200 టన్నులు మాత్రమే మార్కెట్‌కు రాగా... ఇటీవల అంటే వారం రోజులుగా వెయ్యి నుంచి రెండు వేల టన్నులకు పెరిగాయి. బుధవారం 4,500 టన్నుల టమాటాలు రావడంతో ధరలు సాధారణ స్థాయికి చేరుకున్నాయి. కక్కలపల్లి మండీలో కిలో టమాట ధర గరిష్టంగా రూ.45 పలికిందని రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.30 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు



పూలకుంటపల్లి వద్ద పంటను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

అమడగూరు: రైతులకు మేలు జరిగేలా ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ప్రతి సర్వే నంబరుకు వెళ్లి ఈ-క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అవకతవకలను పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఆయన మహమ్మదాబాద్ రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్బీకేలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో అలసందలు, ఉలవలు, పెసలు అందిస్తోందన్నారు. వాటిని రైతులకు అందజేయాల్సిన బాధ్యత ఆర్బీకే సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పూలకుంటపల్లి, తుమ్మల గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన 'స్పందన'లో అందిన ఫిర్యాదుల మేరకు ఆయా గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో వివరాలు ఆరా తీశారు.

ముగ్గురికి సీఐలుగా పదోన్నతి




వెంకటరమణ, హేమంత్‌కుమార్, వెంకట శ్రీహర్ష

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ముగ్గురు సబ్‌ఇన్‌స్పెక్టర్ల(ఎస్‌ఐ)కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు (సీఐ)లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయలసీమ రేంజ్‌లో మొత్తం 41 మందికి పదోన్నతి కల్పించగా, అందులో జిల్లాకు చెందిన ముగ్గురు ఉన్నారు. వారిలో 'కియా' పోలీసు స్టేషన్ ఎస్‌ఐ కె.వెంకటరమణ, ముదిగుబ్బ ఎస్‌ఐ హేమంత్‌కుమార్, బత్తలపల్లి ఎస్‌ఐ వెంకట శ్రీహర్ష ఉన్నారు. వీరంతా గురువారం కర్నూలు రేంజ్ డీఐజీ ఎదుట రిపోర్ట్ చేసుకోనున్నారు.

అనంతపురంలో 9 మందికి...

అనంతపురం జిల్లాకు చెందిన 9 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతులు లభించాయి. అనంతపురం పీటీసీలో పనిచేస్తున్న బి.మహానంది, వి.రమేష్, అనంతపురంలో పనిచేస్తున్న టి.నాగమణి, ఎస్.జాకీర్, ఎస్‌కే చాంద్‌బాషా, బి.రాఘవరెడ్డి, యు.వలిబాషా, బి.రామకృష్ణారెడ్డి, యం.శ్రీకాంత్ సీఐలుగా పదోన్నతి పొందారు.

18న షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



పుట్టపర్తి టౌన్: జిల్లా షూటింగ్ బాల్ సీనియర్ జట్టు ఎంపికకు ఈనెల 18న పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ పూల ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పోటీలుంటాయని, క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. పూర్తి వివరాలకు 9573065966 నంబర్లో సంప్రదించాలన్నారు.

శ్రావణం...శుభ ముహూర్తాల సమ్మేళనం. అందుకే అందరూ శ్రావణం కోసం వేయి కళ్లలో ఎదురుచూస్తుంటారు. నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండగా.. నోములు, వ్రతాలతో పాటు ఈసారి జిల్లాలో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కల్యాణమండపాల వద్ద సందడి కనిపిస్తోంది.

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- రేపటి నుంచి శుభ ముహూర్తాలు
- జిల్లాలో ఏకం కానున్న వందలాది జంటలు
- కల్యాణ మండపాలకు ఫుల్ డిమాండ్



పెళ్లికి బాజా మోగింది!

కదిరి: పెళ్లి... ప్రతి ఒక్కరి జీవితంలో అపురూపమైన వేడుక. అందుకే కలకాలం గుర్తుండిపోయేలా చేసుకోవాలనేది ప్రతి ఒక్కరి కోరిక. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేస్తారు. పెళ్లి కుదిరినప్పటి నుంచి ప్రతి ఈవెంట్‌ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోవాలని ఇటు నూతన వధూవరులతో పాటు అటు వారి కుటుంబ సభ్యులు, బంధువులూ భావిస్తారు. వీటన్నికన్నా ముఖ్యమైనది పెళ్లి ముహూర్తం. వివాహం నిశ్చయమైనా ఆషాఢమాసం, అధిక శ్రావణంతో శుభ ముహూర్తాలు లేక నిరీక్షిస్తున్న వేలాది జంటలు ఈ శ్రావణంలో ఒక్కటి కాబోతున్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా పెళ్లికి సన్నాయి మేళాలు మోగనున్నాయి. ఈ నెల 17న శ్రావణం ప్రారంభం కానుండగా, మరుసటి రోజు నుంచే ముహూర్తాలూ ఉన్నాయి.

18 నుంచి వివాహ ముహూర్తాలు

సాధారణంగా శ్రావణ మాసంలోనే ఎక్కువగా పెళ్లిళ్లు జరుగుతాయి. బుధవారం(16న) అమావాస్య వచ్చింది. తర్వాత నిజ శ్రావణమాసం. ఈ నెల 18వ తేదీ నుంచి దాదాపు వరుసగా 10 రోజుల పాటు వివాహ ముహూర్తాలున్నాయి. ఇవి డిసెంబర్ వరకూ కొనసాగనున్నాయి. ముహూర్త బలం వల్ల ఒకేరోజు ఎక్కువ పెళ్లిళ్లు జరుగుతుండటంతో కదిరి ప్రాంతంలోని కల్యాణ మండపాలు ఖాళీగా లేకపోవడంతో పక్కనే ఉన్న మొలకలచెరువు, పులివెందులలోని కల్యాణ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. హిందూపురం, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, గోరంట్ల, బత్తలపల్లి, పుట్టపర్తి, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి.

అన్నింటికీ డిమాండే

శ్రావణంలో చాలా ముహూర్తాలు ఉన్నప్పటికీ కొన్నింటిని దివ్యమైనవిగా పేర్కొంటారు. ఆ ముహూర్తంలోనే పిల్లల పెళ్లిళ్లు చేయాలని తల్లిదండ్రులు భావిస్తుంటారు. అందుకే ఆయా తేదీల్లో కల్యాణ మండపాలతో పాటు అన్నింటికీ డిమాండే. పెళ్లితో కొత్తగా ఒక్కటి కానున్న జంటలు, వారి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు అన్ని హంగులూ ఉన్న కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల కోసం పరుగులు పెడుతున్నారు. శ్రావణ మాసం మొదలు డిసెంబర్ వరకూ జిల్లాలో వెయ్యికిపైగా పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

ఒకదాని వెనుక మరొకటిగా

శ్రావణంలో పెళ్లిళ్లతో పాటు పండుగలూ ప్రతి ఇంటా సంతోషాలు నింపుతాయి. ఈనెల 21న వచ్చే నాగుల చవితి, గరుడ పంచమి రాకతో ప్రధాన పండుగలు ఆరంభం కానున్నాయి. 22న మంగళగౌరీ వ్రతాలు 25న వరలక్ష్మీవ్రతం, 31న రాఖీ పౌర్ణిమ, ఈనెల చివరలో 31 నుంచి మూడు రోజుల పాటు రాఘవేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాలు, సెప్టెంబర్ 6న శ్రీ కృష్ణాష్టమి పర్వదినాలు వరుసగా వస్తాయి. 14న పొలాల అమావాస్యతో నిజ శ్రావణంలో వచ్చే పండుగలు ముగిసి భాద్రపదంలో ప్రవేశిస్తాయి. అలాగే ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ వరకూ నోములు, వ్రతాలు ఆచరించుకునేందుకు మహిళలు సిద్ధమయ్యారు.

ఎందరికో ఉపాధి

పెళ్లంటే రెండు జీవితాల కలయిక మాత్రమే కాదు. ఎందరికో ఉపాధి కూడా. పెళ్లి పత్రికల ముద్రణ, ఫ్లెక్సీల ఏర్పాటు, కల్యాణ మండపం, అద్దె గదులు తీసుకోవడం, ఫ్లవర్ డెకరేషన్, పెళ్లి భోజనాలు, ఫొటోలతో పాటు వీడియోలు తీయడం, పెళ్లి కూతురు అలంకరణ, ఫంక్షన్ హాలు శుభ్ర పరచడం, పురోహితులు, భజంత్రీలు, రవాణా ఇలా ఎంతో మందికి ఉపాధి దొరుకుతుంది. అలాగే బంగారు, నిత్యావసర సరుకులు, వస్త్ర వ్యాపారులకు కూడా పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం బాగా జరుగుతుంది. ప్రధానంగా పట్టు వస్త్రాల కోసం వచ్చే వారితో ధర్మవరం పట్టణం కిటకిటలాడుతుంది.

పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది



ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ శుభ ముహూర్తాలు తక్కువే. జూలైలో ఆషాఢమాసం వచ్చింది. అందుచేత పెళ్లిళ్లకు బ్రేక్ పడింది. గురువారం నుంచి శ్రావణ మాసం వస్తోంది. కాబట్టి ఈ నెల 18, 20, 21, 23, 27, 31 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్ నెలలో కూడా 1, 3, 10వ తేదీల్లో శుభ ముహూర్తాలున్నాయి. డిసెంబర్ ఆఖరు వరకూ పెళ్లిళ్ల సీజనే.

–నరసింహాచార్యులు, ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు

ఫంక్షన్ హాళ్లకు డిమాండ్



శ్రావణమాసం రావడంతో పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. మంచి ముహూర్తం ఉండటంతో ఒకే తేదీలో చాలా పెళ్లిళ్లు ఉన్నాయి. దీంతో ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ ఎక్కువైంది. ముందుగా బుక్ చేసుకున్న వారికే హాళ్లు అద్దెకు ఇస్తున్నాం. ఆ తర్వాత తెలిసినవారు వచ్చినా ఏం చేయలేని పరిస్థితి. పెళ్లిళ్ల సీజన్‌తో ఎంతో మందికి ఉపాధి ఉంటుంది.

–బీవీ శివారెడ్డి, దత్తా కల్యాణ మండపం నిర్వాహకుడు, కదిరి

పరుగున కృష్ణమ్మ

- హంద్రీ-నీవాకు నీటి విడుదల
- రెండు పంపులతో 675 క్యూసెక్కుల ఎత్తిపోత



మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ-నీవాకు వస్తున్న కృష్ణా జలాలు

అనంతపురం సెంట్రల్: జిల్లాకు కృష్ణమ్మ పరుగుపరుగున వస్తోంది. శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకానికి నీటిని విడుదల చేశారు. బుధవారం మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ మోటార్లను ఆన్ చేసి ప్రారంభించారు. తొలుత రెండు పంపుల ద్వారా 675 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. క్రమంగా నీటిని పెంచుకుంటూ పోవాలని నిర్ణయించినట్లు హంద్రీ-నీవా ఎస్‌ఈ దేశేనాయక్ తెలిపారు. ఇదిలా ఉంటే హంద్రీ-నీవాకు ఎన్ని రోజులు నీళ్లు వస్తాయో చెప్పలేమని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 112.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో రాలేదు. మొత్తం 5,254 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటి మట్టం 862 అడుగులు కాగా 834 అడుగుల వరకు హంద్రీ-నీవాకు ఇబ్బంది ఉండదని వివరించారు. ఆలోగా వర్షాలు పడి ఇన్‌ఫ్లో పెరిగితే హంద్రీ-నీవాకు నిరంతరాయంగా కృష్ణా జలాలు వస్తాయని పేర్కొన్నారు. నీటిమట్టం పడిపోతే మల్యాల ఎత్తిపోతల పథకానికి నీళ్లు తీసుకోవడానికి కుదరదని వివరిస్తున్నారు. రైతులు హంద్రీ-నీవాపై ఆధారపడి ఇప్పుడే పంటలు సాగుచేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్యాపకులు 21లోపు దరఖాస్తు చేసుకోవాలి

కదిరి అర్బన్: జిల్లాలోని డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యూవల్ కోసం ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న డీఎస్సీ ఆధ్వర్యంలో రెన్యూవల్లు జరుగుతాయన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులంతా 21వ తేదీలోపు ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డుతో జతచేసి కదిరి ఐడీ కళాశాలలో అందజేయాలని సూచించారు.

పగడాలవారిపల్లిలో భారీ చోరీ

- తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దొంగలు
- 235 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు అపహరణ



వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ వాసుదేవన్

అమడగూరు: ఓడీచెరువు మండలం పగడాలవారిపల్లిలో మంగళవారం రాత్రి భారీగా చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గురుకుల శ్రీనివాసరెడ్డి ఇంట్లో చొరబడిన దుండగులు రూ.3 లక్షల నగదు, 235 గ్రాముల బంగారును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి మంగళవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి తోటకు వెళ్లి పడుకున్నాడు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా, తలుపులు పగిలిపోయి కనిపించాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ.3 లక్షల, పక్కనే ఉన్న ఉడ్‌షోకేస్‌లో ఉంచిన 235 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ గోపి గ్రామానికి చేరుకుని శ్రీనివాసరెడ్డి ఇంటి పరిసరాలను పరిశీలించారు. క్లూ టీంను రప్పించి తలుపులు, బీరువాలకు ఉన్న వేలిముద్రలను సేకరించారు. దుండగులు ప్రధాన ద్వారం వద్ద ఉన్న సీసీ కెమెరాను పైకెత్తి, తలుపు ముందున్న విద్యుత్ బల్బును తీసివేసి తర్వాత తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. త్వరలోనే దొంగలను పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. బాధితుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..వరలక్ష్మీ వ్రతం పండుగ ఉండటంతో బ్యాంక్ లాకర్‌లో ఉంచిన నెక్లెస్, లాంగ్‌చైన్, నల్లపూసల చైన్, 4 గాజులు, 3 జతల కమ్మలు, ఉంగరాన్ని ఇంటికి తెచ్చినట్లు తెలిపారు.

స్వచ్ఛ ఓటరు జాబితాకు సహకరించండి

పుట్టపర్తి అర్బన్: స్వచ్ఛ ఓటరు జాబితాకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని డీఆర్‌ఓ కొండయ్య కోరారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ, నూతన ఓటర్ల నమోదు కోసం ఈ నెల 21 నుంచి జిల్లాలో ఇంటింటి సర్వే కొనసాగుతోందన్నారు. ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు రాకుండా కొత్తగా ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపుల జాబితాను అన్ని రాజకీ పార్టీల ప్రతినిధులకు ఇస్తామన్నారు. జాబితాను పరిశీలించి అభిప్రాయాలను, సలహాలు, సూచనలను తెలియజేయాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓటుతో పాటు మృతి చెందిన వారి ఓట్లను ఏజెంట్ల సమక్షంలో పంచనామా నిర్వహించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, ఎన్నికల డీటీ మైనుద్దీన్, భాస్కర్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు చేరుకోవాలి

- హౌసింగ్ అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

పుట్టపర్తి అర్బన్: గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేసి లక్ష్యాలు చేరుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి వెంకటరెడ్డితో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గత ఏడాది జిల్లా హౌసింగ్ టార్గెట్ 10 వేల ఇళ్లు కాగా, అధికారులంతా సమన్వయంతో పనిచేసి 11 వేలకుపైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని అభినందించారు. ఈ ఏడాదికి 15,451 ఇళ్లు నిర్మించాలని లక్ష్యం విధించారన్నారు. అందులో ఇప్పటికే 92 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. దీంతో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉందన్నారు. ఇళ్లు సకాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత కూడా పాటించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 25వ తేదీ నాటికి రాష్ట్రంలో 5 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సంకల్పించారని, ఇందులో భాగంగా 9 రోజుల్లో జిల్లాలో వివిధ దశల్లో ఉన్న 1,348 ఇళ్లను పూర్తి చేయాలన్నారు. అలాగే గోరంట్ల మండలం మల్లాపల్లిలోని జగనన్న హౌసింగ్ కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించి పూర్తి చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ మోజెస్, హౌసింగ్ డీఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

● అలరించిన మీనాక్షి తిరుకల్యాణం

ప్రశాంతి నిలయం: మైమరపించే భక్తిగీతాలు.. నయన మనోహరంగా సాగిన చిన్నారుల నృత్య ప్రదర్శనతో భక్తులు ఆధ్యాత్మిక పరవశం చెందారు. శ్రీ సత్యసాయి విద్యావాహిణి సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా మధురైకి చెందిన మహాత్మా పాఠశాల విద్యార్థినులు బుధవారం సాయికుల్వంత్ మందిరంలో 'మీనాక్షి తిరుకల్యాణం' నాటికను ప్రదర్శించారు. ప్రధానంగా సుందరేశ్వర్, మీనాక్షిల వివాహ ఘట్టాలను అత్యద్భుతంగా వివరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో కలసి సంయుక్తంగా నిర్వహిస్తున్న పలు పథకాలు, సేవా కార్యక్రమాల గురించి విద్యావాహిణి డైరెక్టర్ కరుణా మున్షి వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు హిమవాహిని రత్నాకర్ నూతన వస్త్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

మీనాక్షి తిరుకల్యాణం నాటకంలోని ఓ సన్నివేశం





మాట్లాడుతున్న కరుణా మున్షి



అద్భుత నృత్యంతో ఆకట్టుకున్న చిన్నారులు



బహుమతులు అందజేస్తున్న హిమవాహిని రత్నాకర్

టీచర్ల సర్దుబాటు షురూ

- టీచర్ల కొరత ఉన్న స్కూళ్లకు 'మిగులు' సర్దుబాటు
- స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో తొలి ప్రాధాన్యత
- రేపటిలోగా ప్రక్రియ పూర్తికి విద్యాశాఖ ఉత్తర్వులు

రాప్తాడు రూరల్: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు అవసరమైన స్కూళ్లను మిగులు (సర్‌ప్లస్) టీచర్లతో సర్దుబాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 18 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఉండే విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకోసం జిల్లాస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆమోదంతో అవసరమైన స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఈ కమిటీకి అనంతపురం కలెక్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కో చైర్మన్‌గా, అనంతపురం డీఈఓ కన్వీనర్‌గా, శ్రీసత్యసాయి డీఈఓ మెంబరుగా ఉంటారు.

ముందుగా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల నుంచి..

ముందుగా ఆయా స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని స్కూళ్లలో మిగులుగా ఉన్న టీచర్లను సర్దుబాటు చేస్తారు. అక్కడ లేకపోతే మండల పరిధిలో చేస్తారు. అక్కడ అందుబాటులో లేకపోతే పక్క మండలం నుంచి సర్దుబాటు చేస్తారు. అక్కడా అవకాశం లేకపోతే డివిజన్, ఆ తర్వాత పక్క డివిజన్ నుంచి సర్దుబాటు చేస్తారు. అవసరమైతే ఒక యాజమాన్యం నుంచి మరో యాజమాన్యం పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉండేలా సర్దుబాటు చేస్తారు. మునిసిపల్ పాఠశాలలకు మునిసిపల్ పాఠశాలల నుంచే సర్దుబాటు చేయాలి. అక్కడ అందుబాటులో లేకపోతే ఇతర యాజమాన్యాల నుంచి సర్దుబాటు చేసుకోవచ్చు.

కసరత్తు చేస్తున్నాం



విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉండే స్కూళ్లలో బోధనకు ఇబ్బందులు లేకుండా మిగులుగా ఉన్న స్కూళ్ల నుంచి సర్దుబాటు చేస్తాం. ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కసరత్తు చేస్తున్నారు. రేపటిలోగా పూర్తి చేస్తాం. స్కూళ్ల వారీగా విద్యార్థుల సంఖ్య, టీచర్ల సంఖ్యను పరిశీలిస్తున్నాం. ఏ ఒక్క స్కూల్‌లోనూ బోధనకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ఎం.సాయిరామ్, డీఈఓ, అనంతపురం

క్లుప్తంగా

డీఎడ్ పరీక్షలకు 58 మంది గైర్హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న గోవిందనాయక్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన డీఎడ్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 58 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 167 మందికి గాను 109 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ పరిశీలించారు.

వివాహిత హత్య

కళ్యాణదుర్గం రూరల్: కట్టుకున్న ఇల్లాలిపై అనుమానం పెనుభూతమైంది. నాలుగు పదుల వయసులో ఉన్న భార్యకు ఇతరులతో వివాహేతర సంబంధం అంటగడుతూ భర్త దాడి చేయడంతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామ ఎస్సీ కాలనీలో నివాసముంటున్న నాగరాజు, యల్లక్క (42) దంపతులకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా యల్లక్క ప్రవర్తనపై భర్తకు అనుమానాలు ఎక్కువయ్యాయి. ఇతరులతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నావంటూ తరచూ ఆమెతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే బుధవారం తెల్లవారుజామున భార్యతో మరోసారి గొడవపడ్డాడు. అనవసరంగా తనపై నిందలు వేయడం మంచిది కాదని ఆమె సమాధానమివ్వడంతో పక్కనే ఉన్న ఇనుప చువ్వతో ఆమె పొట్టపై బాదాడు. బలమైన దెబ్బ తగలడంతో యల్లక్క ఒక్కసారిగా కుప్పకూలింది. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా నాగరాజు అక్కడి నుంచి ఉడాయించాడు. ఉదయం కుటుంబసభ్యులు నిద్రలేచి యల్లక్కను గమనించి లేపేందుకు ప్రయత్నించారు. ఆమెలో చలనం లేకపోవడంతో మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని సీఐ తేజమూర్తి, ఎస్ఐ నాగమధు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నవజాత శిశువుకు రక్ష

- సర్వజనాస్పత్రిలో కొత్తగా మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటు
- రూ.35 లక్షలు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



ప్రస్తుతమున్న నవజాత శిశు కేంద్రంలో వార్మర్లపై పసికందులు

అనంతపురం క్రైం: జిల్లా సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటు కానుంది. పసికందుల అడ్మిషన్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అదనంగా 20 పడకల సామర్థ్యంతో ఉన్న మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది.

ఇప్పటికే అందుబాటులో ఓ కేంద్రం..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ వైద్య రంగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూలంగా ప్రక్షాళన చేశారు. దీంతో నిరుపేద రోగులకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతోంది. శిశు మరణాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకున్న ప్రభుత్వం... రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పసికందుల అడ్మిషన్లు అత్యధికంగా ఉన్న ఆస్పత్రులకు 20 పడకల సామర్థ్యంతో మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు అనమతులు జారీ చేసింది. ఇందులో భాగంగా అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు రూ.35 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే ఆస్పత్రిలో ఓ కేంద్రం అందుబాటులో ఉండగా, మరో మూడు నెలల్లో కొత్తగా 20 పడకల కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి అనువైన స్థలాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆదేశాల మేరకు చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ సంజీవప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసశౌరి, ఎస్ఎన్‌సీయూ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్‌నాయక్ ఎంపిక చేశారు. కేంద్రం అందుబాటులోకి రాగానే నలుగురు వైద్యులు, 10 మంది స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బందిని నియమించనున్నారు.

ఖరీదైన వైద్యం ఉచితం..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 2011లో 20 పడకల సామర్థ్యంతో నవజాత శిశు కేంద్రం ఏర్పాటైంది. రోజుల వ్యవధి పసికందులకు ఈ కేంద్రంలో పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యాన్ని అందిస్తున్నారు. ప్రతి నెలా కాన్పుల వార్డులో 700 నుంచి 800 వరకూ ప్రసవాలు జరుగుతాయి. అందులో బరువు తక్కువ, కామెర్లు, జన్యుపరమైన, సెప్సిస్, తదితర ఇన్‌ఫెక్షన్లతో బాధపడే పసికందులను నవజాత శిశు కేంద్రంలో చేర్చి చికిత్స అందజేస్తున్నారు. రోజూ 35 నుంచి 40 మంది పసికందులకు ఫొటోథెరపీ, వార్మర్లు, సీప్యాప్, అవసరమైతే వెంటిలేటర్ ద్వారా చికిత్స చేస్తున్నారు. ఈ కేంద్రంలో ప్రతి నెలా 200 అడ్మిషన్లు ఉంటాయి. చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్‌నాయక్, వైద్యులు డాక్టర్ దినకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ హరిణి, డాక్టర్ కళావతి, 14 మంది స్టాఫ్‌నర్సులు, 3 ఎఫ్ఎన్‌ఓలు, ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ తరహా చికిత్స అందించేందుకు రోజుకు రూ.10వేల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేస్తున్నారు.

పసికందులకు నాణ్యమైన వైద్యం



ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలతో పాటు పొరుగున ఉన్న జిల్లా నుంచి కష్టతరమైన కాన్పుల కేసులు జీజీహెచ్‌కు ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో తక్కువ బరువు, వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న పసికందులను గుర్తించి నవజాత శిశు కేంద్రంలో నాణ్యమైన వైద్యం అందజేస్తున్నాం. అత్యధిక కేసులు నమోదవుతున్న నేపథ్యంలో పసికందులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం మరో కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం



చిలమత్తూరు: మండలంలో ఆర్‌ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... చిలమత్తూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలో పనిచేస్తున్న రవనకుల్లాకు మంగళవారం ఉదయం ఉన్నఫళంగా ముక్కులో నుంచి రక్త స్రావం మొదలైంది. దీంతో పాఠశాల ఎదురుగా ఉన్న ఆర్‌ఎంపీ వెంకటేష్ వద్దకెళ్లడంతో ఆయన మూడు రకాల ఇంజక్షన్లు వేశాడు. దీంతో రక్తస్రావం మరింత తీవ్రం కావడంతో వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన అనంతరం రవనకుల్లా పరిస్థితి విషమంగా ఉందని వైద్యాధికారి రామకృష్ణ నిర్ధారించి, 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అవగాహన లోపంతో ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ల వల్లనే రవనకుల్లా పరిస్థితి విషమంగా మారిందని వైద్యాధికారి అన్నారు. ఇదే విషయంపై ఆర్‌ఎంపీ వెంకటేష్‌ను వివరణ కోరగా.. ముక్కులో రక్తం కారుతుండగా తన వద్దకు వచ్చాడని, ఆ సమయంలో ఇంజక్షన్ ఇచ్చింది వాస్తవమేనని అంగీకరించాడు.

శనీశ్వరాలయంలో శ్రావణ శోభ



హారతి ఇస్తున్న అర్చకుడు

పావగడ: ఉభయ రాష్ట్రాల్లో ప్రఖ్యాతిగాంచిన పావగడ శనీశ్వరాలయంలో శ్రావణ శోభ సంతరించుకుంది. అధిక శ్రావణం బుధవారం ముగియడంతో నిజ శ్రావణ మాసం గురువారంతో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో శ్రావణ మాస వేడుకలకు శనీశ్వరాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయానికి కొత్తగా రంగులు వేశారు. ఇక్కడ పూజలందుకుంటున్న శనీశ్వరుడు శాంత స్వరూపుడని, తనను నమ్మి కొలిచే వారికి ఎలాంటి ఆపదలు తలపెట్టడని భక్తుల నమ్మకం. అంతేకాక శ్రావణ మాసంలో శనీశ్వరుడికి తైలాభిషేకాలు నిర్వహిస్తే ఏలిననాటి శని దోషాలు నివారణ అవుతాయని విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో శ్రావణ శనివారాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ సమితి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నెల 19న మొదటి శ్రావణ శనివారం ఉదయం 4 గంటలకే తైలాభిషేకాలు, నవగ్రహ పూజలు ఉంటాయి. 25న శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వర మహాలక్ష్మి పండుగ సందర్భంగా శీతలాంబదేవికి సహస్ర కుంకుమార్చనలు, 26న రెండో శ్రావణ శనివారం శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు పూల మంటప ఉత్సవం ఉంటుంది. సెప్టెంబర్ 2న స్వామి వారికి తైలాభిషేకాలు, 9న శనివారం రాత్రి 7 గంటలకు జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వర స్వామి విశేష వెండి పల్లకీ ఉత్సవం ఉంటుంది.

నేటి నుంచి శ్రావణ ఉత్సవాలు

- కసాపురంలో ప్రత్యేక ఏర్పాట్లు

గుంతకల్లు రూరల్: శ్రావణ మాస ఉత్సవాలకు ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సిద్ధమైంది. ఉత్సవాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యుడు పూర్తి చేశారు. ఈ నెల 19 శ్రావణ మొదటి శనివారాన్ని పురస్కరించుకుని సీతారామచంద్ర లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహించనున్నారు. ఈ నెల 26న హనుమద్ వాహన సేవ ఉంటుంది. సెప్టెంబర్ 2న గరుడ వాహనం, సెప్టెంబర్ 9న గజ వాహన సేవలు ఉంటాయి. అలాగే శ్రావణమాసంలో వచ్చే నాలుగు మంగళవారాలూ వెండి రథోత్సవాలను నిర్వహించనున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం..

శ్రావణ మాసంలో వచ్చే నాలుగు శనివారాలు, నాలుగు మంగళవారాల్లో ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉచిత దర్శనము, ముఖ మంటప దర్శనము, శీఘ్ర దర్శనము, అతిశీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. కల్యాణమంటపాలతో పాటు, అన్నదాన కేంద్రం పక్కనున్న రేకుల షెడ్లు, గంగా నిలయం, పీఏసీలో ఉన్న డార్మెటరీలో భక్తులకు ఉచిత వసతి కల్పించనున్నారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి అవసరాలకు ప్రత్యేకంగా నీటి కొళాయిలు, దర్శనానంతరం ఉచిత ప్రసాద వితరణ కేంద్రం ఏర్పాటు చేశారు. శని, మంగళవారాల్లో స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఆలయ తూర్పు రాజగోపురం ముందు భాగంలో ఉన్న బెల్దోణ సత్రంలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బఫే సిస్టం ద్వారా అన్నదానానికి చర్యలు తీసుకున్నారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలతోపాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. రామదూత నిలయం ఎదుట వాహనాల పార్కింగ్, ఆలయ ముందు భాగంలో వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.



నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ ముఖద్వారం

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం మానేయమన్నందుకు మనస్తాపంతో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడగా.. ఫోన్ సంభాషణ వద్దన్నందుకు ఓ యువతి, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు...



తాడిపత్రి: మృతుడు రామకృష్ణ



యల్లనూరు: మృతురాలు అశ్వని

తాడిపత్రి: వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన గుర్రప్ప రామకృష్ణ (25) ఏడాది క్రితం తాడిపత్రికి వలస వచ్చి సంజీవనగర్ రెండో రోడ్డులోని అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. భార్య మాధవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు తాడిపత్రికి చెందిన దామోదరరెడ్డి, నరసింహాచారి, కంబాల లక్ష్మీనారాయణ వద్ద అప్పు చేశాడు. సకాలంలో అప్పులు తీర్చకపోవడంతో వడ్డీల భారం పెరిగి రూ.50 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో డబ్బు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారులు తరచూ ఇంటి వద్దకెళ్లి గొడవ చేయసాగారు. దీంతో మనస్తాపం చెందిన రామకృష్ణ... మంగళవారం రాత్రి కూల్ డ్రింక్‌లో విషపూరిత గుళికలు కలుపుకుని తాగాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం తాగొద్దన్నందుకు..

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలోని ఓబుళదేవనగర్‌కు చెందిన ప్రైవేట్ ఫొటోగ్రాఫర్ వంశీకృష్ణ (26)కు రెండేళ్ల క్రితం మదనపల్లికి చెందిన సునీతతో వివాహమైంది. సంతానం లేదు. మద్యానికి బానిసైన వంశీకృష్ణ.. భార్య బతిమలాడినా తాగుడు మానుకోలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన భర్త మధ్యాహ్నం పీకల దాకా మద్యం సేవించి వచ్చాడు. దీంతో సునీత మందలించింది. తీరు మార్చుకోకపోతే నవ్వుల పాలవుతామని హితవు పలికింది. దీంతో మనస్తాపం చెందిన వంశీకృష్ణ లోపలి గదిలోకి వెళ్లి గడియపెట్టుకుని, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఎంత పిలిచినా లోపల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో అనుమానం వచ్చి కిటికీ నుంచి ఉరితాడుకు విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ సీఐ శివరాముడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రెండో రోజుల్లో కుమార్తె వివాహముండగా..

తాడిపత్రి: స్థానిక శ్రీరాముల పేటకు చెందిన మల్లికార్జున (45) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్య కుమారి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్ని నెలలుగా పనికి వెళ్లకుండా అతిగా మద్యం సేవించి ఇంటి పట్టునే ఉంటున్నాడు. దీంతో మరో రెండు రోజుల్లో కుమార్తె వివాహం పెట్టుకుని అతి మద్యం తాగడం మంచిది కాదని, బంధువుల ఎదుట పరువు పోతుందని మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన మల్లికార్జున రాత్రి అందరూ నిద్రలో ఉండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అబ్బాయితో మాట్లాడొద్దన్నందుకు..

యల్లనూరు: యల్లనూరు మండలం పెద్ద మల్లేపల్లికి చెందిన రామాంజినేయులు, సావిత్ర దంపతుల మూడో కుమార్తె అశ్వని (19)కి వేములపల్లి గ్రామానికి చెందిన మేనమామ కొడుకుతో వివాహం జరిపించాలని ఇరు కుటుంబాల సభ్యులు నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో వివాహం నిశ్చయం కాక ముందే అబ్బాయితో మాట్లాడడం బాగుండదని అమ్మాయికి సూచించారు. అయినా ఆమె తరచూ ఫోన్‌లో అబ్బాయితో మాట్లాడుతుండడం గమనించిన తల్లిదండ్రులు మంగళవారం రాత్రి మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అశ్వని బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తల్లితో సహా ఇద్దరు చిన్నారుల అదృశ్యం



అదృశ్యమైన సరళ, ఇద్దరు చిన్నారులు

పరిగి: తల్లితో పాటు ఇద్దరు పిల్లలు కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. పరిగికి చెందిన సరళ... తన ఇద్దరు కుమారులను తీసుకుని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైన ఆమె ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లోను, బంధువుల ఇళ్లలోనూ విచారించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గార్లదిన్నె: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... బుధవారం ఉదయం గార్లదిన్నె మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పామిడి వైపు నుంచి అనంతపురానికి బొలెరో వాహనంలో తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తింరుట, స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా హరికృష్ణపై కేసు నమోదు చేశారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

- ఆదాయం పెంచుకోవడంలో భాగంగా ప్రతిపాదనలు
- వ్యాపారులకు అనువుగా ప్రణాళికలు
- నేడు టెండర్ల ఖరారు



హిందూపురం ఆర్టీసీ బస్టాండ్

హిందూపురం టౌన్: ఆర్టీసీ స్థలాల సంరక్షణలో భాగంగా వాటిని లీజుకు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. తద్వారా ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల కార్గో సేవలతో ఆదాయం మెరుగుపరుచుకున్న ఆర్టీసీ.. తాజాగా జిల్లాలోని ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్లను నేడు ఖరారు చేయనున్నారు.

ఏటా రూ.3కోట్ల ఆదాయం

జిల్లా వ్యాప్తంగా ఆరు ఆర్టీసీ డిపోల పరిధిలోని డీఓటీ షాపులు, ఖాళీ స్థలాల్లో తాత్కాలిక షాపులు మొత్తం 210 ఉన్నాయి. వీటి ద్వారా నెలకు రూ.25లక్షల చొప్పున ఏటా దాదాపు రూ.3కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయాన్ని మరింత పెంచేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, కదిరి, మడకశిర, పుట్టపర్తి ఆర్టీసీ డిపోల పరిధిలోని ఖాళీ స్థలాలను లీజు పద్ధతిలో బాడుగకు ఇవ్వనున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 77 షాపుల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించారు. ఇవే కాకుండా ఆర్టీసీ పరిధిలోని స్థలాల్లో ఏవరైనా వ్యాపారులు ఆసక్తి ఉండి వ్యాపారాలు చేసుకోవడానికి ముందుకు వస్తే వారి నుంచి అర్జీలను స్వీకరించి టెండర్లను ఆహ్వానిస్తామని అధికారులు చెబుతున్నారు. వ్యాపారులకు అనువుగా కావాల్సిన కొలతల్లో స్థలాన్ని కేటాయించడమే కాక, పార్కింగ్ సౌకర్యం ఉండేలా ప్రణాళిక ను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ స్థలాల్లో 61 ఖాళీ స్థలాలు, 14 పక్కా షాపులు, రెండు మరుగుదొడ్ల నిర్వహణకు టెండర్లను పిలిచినట్లు అధికారులు తెలిపారు.

నేడు టెండర్ల ఖరారు

ఆరు ఆర్టీసీ బస్టాండ్లలో ఉన్న పక్కా స్టాల్స్, ఖాళీ స్థలాలకు ఇప్పటికే అధికారులు టెండర్లను ఆహ్వానించారు. పుట్టపర్తిలోని జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు టెండర్లు దాఖలు చేయాల్సి ఉండగా.. మధ్యాహ్నం 3 గంటలకు వాటిని తెరిచి, అత్యధికంగా కోట్ చేసిన వారికి ఖరారు చేయనున్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి

జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని వాణిజ్యపరంగా లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఐదేళ్ల కాల వ్యవధికి గాను తాత్కాలిక షెడ్డులు ఏర్పాటు చేసుకునేలా 77 స్థలాలకు టెండర్లకు పిలుపునిచ్చాం.

– మధుసూదన్, జిల్లా ప్రజా రవాణాధికారి

తిరుగులేని నమ్మకం

మూగజీవాలు విశ్వాసం కనబరిస్తే ఎంత గొప్పగా ఉంటాయో చాటి చెప్పే అరుదైన ఈ దృశ్యం ధర్మవరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో మల్లాకాలువ గ్రామం వద్ద నిత్యకృత్యమైంది. ఎద్దుల బండిపై ఇసుక తరలిస్తూ జీవనం సాగిస్తున్న అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి వృషభాలు విశ్వాసానికి మారుపేరుగా నిలిచాయి. బుధవారం ఉదయం పనిలో అలసట కారణంగా బండిపై ఆయన కాసేపు కునుకు తీస్తుండగా తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నెమ్మదిగా నది వైపుగా ఎద్దులు సాగాయి. ఇది పల్లె ప్రజలకు సాధారణమే అయినా... నగర, పట్టణ ప్రాంతాలకు చెందిన నేటి తరానికి అబ్బురపరిచే అంశం. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



